



ఎస్‌పికి గ్రేడ్ లెవల్ 12 పే మ్యాట్రిక్స్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎస్‌పి జి.ఆర్ రాధికకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ లెవల్ 12 పే మాట్రిక్స్ స్కేల్‌ను ప్రభుత్వం కల్పించింది. రాష్ట్రంలో పలువురు ఐపిఎస్ అధికారులకు ఈ గ్రేడ్‌ను కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఎస్‌పి రాధికకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ లెవల్ 12 పే మాట్రిక్స్ స్కేల్ వర్తించింది. ఎస్‌పికి జిల్లాలోని పలువురు పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు.



అసంపూర్తిగా హిరమండలం రిజర్వాయర్ పనులు

కొత్త ఏడాదిలోనైనా పూర్తయ్యేనా?

- అసంపూర్తిగా వంశధార పనులు
- మందకొడిగా సాగుతున్న ఆఫ్‌షోర్
- నదుల అనుసంధాన పనులదీ అదే పరిస్థితి
- కదలిక లేని కరకట్టల పనులు

వంశధార, ఆఫ్‌షోర్‌లను ప్రభుత్వం ప్రాధాన్యతా ప్రాజెక్టుల జాబితాలో చేర్చినా పనులు మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా పెద్దగా పురోగతి కనిపించడం లేదు. నిధుల విడుదల, అనుమతుల మంజూరులో జాప్యంతో సకాలంలో పూర్తి కాని పరిస్థితి నెలకొంది. వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులూ నత్తనడకనే సాగుతున్నాయి. వంశధార, నాగావళి వరదల నుంచి రక్షణ కల్పించేందుకు నిర్మించ తలపెట్టిన కరకట్టల పనులపై అధికారులు పలుమార్లు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం కనీసం ఆమోదమూ తెలపలేదు. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో పాటు నదుల అనుసంధానం పనులు ఈ ఏడాదిలోనైనా పూర్తయితే కొంతవరకైనా సాగునీటి సమస్యలు తీరే అవకాశం ఉండడంతో ప్రాజెక్టుల పూర్తిపై రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ఫేజ్-2 స్టేజ్-2 ప్రాజెక్టు పనులకు రూ.933.90 కోట్లతో 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. 2008 జూలై నాటికి 87 ప్యాకేజీ పనులు 31 శాతం, 88 ప్యాకేజీ పనులు 36 శాతం పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ప్రాజెక్టు పనుల అంచనాలను రూ.1616.23 పెంచింది. 2019 వరకు 87 ప్యాకేజీ పనులు 64 శాతం, 88 ప్యాకేజీ పనులు 81 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 87 శాతం పూర్తయ్యాయి. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి అంచనా వ్యయాన్ని రూ.2,407.79 కోట్లకు పెంచింది. 87 ప్యాకేజీ పనులు 90 శాతం, 88 ప్యాకేజీ పనులు 94 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 94.50 శాతం పనులు జరిగాయి. ఇప్పటివరకు 1987,53 కోట్లను ఖర్చు చేశారు.

మందకొడిగా ఆఫ్‌షోర్ పనులు

టెక్కలి, నందిగాం, పలాస, మెళియాపుట్టి మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టును ప్రారంభించింది.. హైదరాబాద్‌కు చెందిన ఎస్.వి.ఇ.సి-ఇందు సంస్థతో రూ.123.25 కోట్లతో ఫిబ్రవరి 18, 2007లో ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం 2008 జనవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం రిజర్వాయర్ పనులను మళ్లీ అదే సంస్థకు అప్పగించింది. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సవరించి రూ.466.28 కోట్లకు పెంచింది. ప్రాజెక్టు పనుల పూర్తికి జూలై 7, 2019 వరకు గడువిచ్చింది. టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిన నాటికి 38 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. మిగిలిన పనులకు సంబంధించి కొత్త రేట్లతో రూ.852.45 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు 45 శాతం మేరే పనులు జరిగాయి

అనుసంధానం పనులపై ఆశలు

వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులకు రూ.78.96 కోట్లు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి వి రమణయ్య అండ్ కంపెనీకు రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగించిన ప్రభుత్వం, గతేడాది డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసేలా పొడిగించింది. ఇప్పటివరకు 80 శాతం పనులే జరిగాయి. పనులు ఈ ఏడాదిలో పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.

కరకట్టల పనులు ప్రారంభమయ్యేనా?

వంశధార, నాగావళి కరకట్టలపనులు 2007-08లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభమయ్యాయి. వంశధార కరకట్టలకు సంబంధించి నాలుగు ప్యాకేజీల పనులు 5.66 శాతం నుంచి 21.34 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నాగావళి కరకట్టల పనులు 33.32 శాతం పూర్తయ్యాయి. నిర్మాణ సంస్థలు 2010 నుంచి పనులను ఆపేశాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం కొత్తగా టెండర్లను పిలిచి కొత్త నిర్మాణ సంస్థలకు పనులను అప్పగించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఉన్నపళంగా పనులను నిలిపేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. వాటిలో కరకట్టల నిర్మాణానికి రూ.13.5 కోట్లు అవసరం పడతాయని అధికారులు ప్రతిపాదించారు. వంశధారపై 23 కిలోమీటర్ల మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.130 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ సంవత్సరమైనా వాటిని పూర్తి చేస్తే, వరద ముప్పు తమకు తప్పుతుందని నదీ తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొత్త సంవత్సర కోలాహలం

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఆనందోత్సాహాల నడుమ కోలాహలంగా సాగాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ గతేడాది తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఇతర ప్రజాప్రతినిధులను కలిసేందుకు వారి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ బారులు తీరారు. కలెక్టర్, ఎస్‌పి, జాయింట్ కలెక్టర్‌ను కలిసేందుకు అధికారులు, పలు శాఖల సిబ్బంది రాకపోకలతో వారి బంగ్లాల వద్ద సందడి నెలకొంది.

ఆదివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత శ్రీకాకుళం నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా యువత కేరింతలు కొడుతూ బాణాసంచా కాల్చి, ఆటపాటలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. కొన్ని కాలనీలు, అపార్ట్‌మెంట్లలో డిజిటల్ సౌండ్ సిస్టమ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహంగా గడిపారు. సోమవారం ఉదయం నుంచి అధికారులు, సిబ్బంది, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల హడావుడి మొదలైంది. అన్ని స్థాయిల వారూ తమపై అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యాలయాల వద్ద కోలాహలం

ఆమదాలవలసలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, శ్రీకాకుళం నగరంలోని పెద్దపాడులో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కాశీబుగ్గలో మంత్రి సీదిరి అప్పలరాజు, కవిటిలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, నిమ్మాడలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు కార్యాలయాలకు పెద్దసంఖ్యలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు బారులు తీరారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇతర ఉన్నతాధికారులు, ఎన్‌జిఒ, రెవెన్యూ సర్వీసుల సంఘం నాయకులు మంత్రి ధర్మానను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వీరితోపాటు ఇతర అధికారులు, అనధికారులు, నాయకులు, కార్యకర్తలు వీరికి శుభాకాంక్షలు తెలియజేసేందుకు తరలివచ్చారు. వందలాది మంది తరలిరావడంతో గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. వచ్చిన వారందరికీ కరచాలనం చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో కోలాహలంగా మారాయి. పలాసలో వైసిపి శ్రేణులు, అభిమానుల కేరింతల నడుమ డాన్స్ చేస్తూ సందడి చేశారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలుసుకునేందుకు జిల్లా అధికారులు, అనధి కారులు తరలి వచ్చారు. ఉదయం పది గంటల నుంచే అతిథులతో కలెక్టర్ బంగ్లా కళకళలాడింది. ఏటా మాదిరిగానే కలెక్టర్‌ను ఎన్‌జిఒలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో జెసి నవీన్ కేకు కట్ చేశారు. ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, అనధికారులు ఆమెను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



శ్రీకాకుళం అర్బన్ : కేకు కట్ చేస్తున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



పలాస : మంత్రి అప్పలరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



కోటబొమ్మాళి : అచ్చెన్నాయుడు, ఎంపీకి శుభాకాంక్షలు చెప్తున్న టిడిపి నాయకులు






ఆమదాలవలస : కేకు కట్ చేస్తున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమగ్రశిక్ష - విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని జ్యోతిరావుపూలే పార్కు వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వాగ్దేవి సందర్శించి సంఘీభావం తెలిపారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కోసం పోరాడుతున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం తగదన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని, ఎంటిఎస్ కల్పించాలని డిమాండ్ చేశారు. శిబిరంలో యుటిఎఫ్ కార్యవర్గ సభ్యులు పురుషోత్తం, జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, పలు సంఘాల నాయకులు ఆదినారాయణ, ఢిల్లీశ్వరరావు, ధర్మారావు, సమగ్ర శిక్ష జెఎసి జిల్లా అధ్యక్షులు పైడి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో కూర్చొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



మంచు కురిసే వేళలో...

ఉదయం ఎనిమిది గంటలైనా కమ్ముకున్న మంచు తెరలు తొలగడం లేదు. కోటబొమ్మాళి, కొత్తపేటతో పాటు పరిసర గ్రామాల్లో రోడ్డెక్కితే ఎదురుగా ఏమొస్తుందో తెలియని విధంగా పొగ మంచు దారులను కమ్మేసింది. దీంతో ఎదురుగా ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితుల్లో వాహనచోదకులు లైట్లు వేసుకుని మరీ వెళ్లాల్సి వచ్చింది. వేకువజాము నుంచి క్రమేణా పెరిగింది. 8.30 గంటల వరకు సూర్య కిరణాలు రాకుండా మంచు తెరలు కమ్మేశాయి.

- ప్రజాశక్తి, కోటబొమ్మాళి

పెగ్గేదేలే...

- న్యూ ఇయర్ వేడుకల్లో భారీగా మద్యం విక్రయాలు
- డిసెంబర్ 31న ఒక్కరోజే రూ.6.04 కోట్ల అమ్మకాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే ఉత్సవాల్లో మందుబాబులు మంచి కిక్ పొందారు. రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు సాగాయి. ఏడాది చివరి రోజైన డిసెంబర్ 31న మందుబాబుల కోసం అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలకు అనుమతివ్వడంతో మద్యం ప్రియులు ఎక్కడా తగ్గలేదు. ఏడాదంతా తాగింది ఒక్క లెక్క, డిసెంబర్ 31న తాగింది మరో లెక్క అనుకున్నారు. దీంతో మందుబాబులు ఫుల్లుగా తాగేసి కొత్త సంవత్సరాన్ని ఆహ్వానం పలికారు. ఆ స్థాయిలోనే కొనుగోలు చేశారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు కాసులు కురిపించాయి. అటు మందు, మాంసం, కేక్‌లు, స్వీట్లు, ఫ్రూట్స్ కోసం జనం భారీగా వెచ్చించారు. ముఖ్యంగా మందుబాబులకు అడ్డే లేకుండా పోయింది. సాయంత్రం ఆరు గంటల నుంచే మద్యం దుకాణాల వద్ద క్యూ కట్టారు. కొంతమంది ముందే సరుకు తెచ్చుకుని దాచుకున్నారు. జిల్లాలో 192 మద్యం షాపులు, 23 బార్లు ఉన్నాయి. సాధారణ రోజుల్లో సుమారు రూ.3.50 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరుగుతాయి. డిసెంబరు 31న రూ.6.04 కోట్ల మద్యం విక్రయాలు సాగాయి. గతేడాది రూ.5.86 కోట్ల అమ్మకాలు సాగాయి. సాధారణంగా ప్రతి ఏడాది బీర్ల అమ్మకాలు ఎక్కువగా సాగుతాయి. ఈసారి మాత్రం బీర్ల అమ్మకాలను ఐఎంఎల్ అమ్మకాలు వెనక్కి నెట్టాయి. ఈ ఏడాది డిసెంబరు 31న బీరు 2,804 కేసులు, ఐఎంఎల్ 6,535 కేసులు అమ్ముడుపోయాయి. గతేడాదితో పోలిస్తే రూ.18 లక్షల మేర ఆదాయం ప్రభుత్వానికి అదనంగా సమకూరింది.



సాంస్కృతిక కార్యక్రమాలతో నిరసన

21వ రోజుకు అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె పతాకస్థాయికి చేరింది. సోమవారానికి సమ్మె 21వ రోజుకు చేరుకోగా, సమ్మెలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటాపాటా, కబడ్డీ ఆడుతూ ఇతర రూపాల్లో సమ్మె శిబిరాల్లో నిరసనలు తెలిపారు. శ్రీకాకుళం అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు థింసా నృత్యం చేస్తూ అనంతరం కబడ్డీ ఆడుతూ నిరసన తెలిపారు. వేషధారణలో ఉన్న అంగన్వాడీ కార్యకర్త జోస్యం చెప్తుండగా, తమ సమస్యల పరిష్కారంపై అంగన్వాడీలు ఆమెను కొంగు చాచి అడుగుతున్న తీరు ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కళ్యాణి, నాయకులు కె.సంధ్య, అప్పలనరసమ్మ, లీల, నాగపద్మ తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో సమ్మె శిబిరంలో ఆటాపాట నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.రమణమ్మ, బి.ఆదిలక్ష్మి, సిహెచ్.ఇందుమతి తదితరులు పాల్గొన్నారు. ఎచ్చెర్లలో సమ్మె ప్రత్యేక బుక్‌లెట్స్‌ను సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు శారద, కనకం, లలిత తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో మోకాళ్లపై నిల్చొని మొక్కుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిర్ల ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ నాయకులు జలజాక్షి, ధనలక్ష్మి, మధుబాల తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో అంగన్వాడీల సమ్మెకు ఎపిటిఎఫ్ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు హైమ, విజయలక్ష్మి, బాలమణి తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో సమ్మె శిబిరంలో అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కారక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ తదితరులు పాల్గొన్నారు. పాతపట్నంలో వంటావార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.శాంతామణి, రాణి, కళావతి తదితరులు పాల్గొన్నారు. పలాసలో సమ్మెకు మద్దతుగా ఎఐసిసిటియు నాయకులు బి.వాసుదేవరావు, సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజుల, బి.సునీత, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు. సోంపేటలో అంగన్వాడీల సమ్మెకు యుటిఎఫ్ నాయకులు జి.రమేష్, గుంట కోదండరావు, ఆర్.పరమేశ్వరరావు తదితరులు సంఘీభావం తెలిపి రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేశారు. ఆమదాలవలసలో సిడిపిఒ కార్యాలయానికి వచ్చిన బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద ఆగి వారి వద్దకు వచ్చారు. అంగన్వాడీల జీతాలు పెంచాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కోరామని తెలిపారు. అంగన్వాడీలకు నూతన శుభాకాంక్షలు తెలియజేసి సిడిపిఒ కార్యాలయానికి వెళ్లారు.



టెక్కలి రూరల్ : ఆటాపాటతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



కొత్తూరు : మోకాళ్లపై నిల్చొని మొక్కుతున్న అంగన్వాడీలు



శ్రీకాకుళం అర్బన్ : థింసా నృత్యం చేస్తున్న అంగన్వాడీలు

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE (SPICAL MOBILE COURT AT SRIKAKULAM
O.S. 251/2023

Between: **Patrudu Rama Krishna** ...Plaintiff
And: **Korada Sireesh** ...Defendants
To,
R-1. Korada Sireesh S/O Late amakrishna Rao, Age 47 Years, Business, R/O Door No: 11-361, Siva Nagar Colony, Narasannapeta Village/Post and Narasannapeta Mandalam, Srikakulam District.
R-2. Korada Laxmi W/O Korada Sireesh, Age 44 Years, Business, R/O Door No: 11-361, Siva Nagar Colony, Narasannapeta Village/Post and Narasannapeta Mandalam, Srikakulam District.
పై నెంబరు దావాలో మీకు నోటీసులు సర్వీస్ గానందున పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తం **తేది 04-01-2024న** వాయిదా యున్నది గనుక సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేటు ద్వారా గాని కోర్టుకు పై **తేదిన ఉదయం 10.30 గం॥లకు** హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ పరుచుకొనవలెను. లేనియెడల మీపరోక్షమున విచారించి తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

BEHARA TIRUMALA RAO
Advocate, Srikakulam,
Cell: 9390611004

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


బొత్సకు శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రిపుల్ ఐటి డైరెక్టర్, అధికారులు


పోలాకి : శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు


టెక్కలి రూరల్ : కృపారాణి దంపతులను సన్మానిస్తున్న నాయకులు


పొందూరు : కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు


ఆమదాలవలస : రవికుమార్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అభిమానులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

నూతన సంవత్సరం సందర్భంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, ఇతర ఉన్నతాధికారులు ఆయన నివాసంలో సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది అందరికీ శుభం కలగాలని మంత్రి బొత్స ఆకాంక్షించారు. సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం శక్తివంచన లేకుండా పనిచేస్తున్న జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్ బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరి నాయుడు, డీన్ వెల్ఫేర్ రవి, పిఆర్ఒ మామిడి షణ్ముఖ ఉన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను డా. బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య నిమ్మ వెంకటరావు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పోలాకి : మండలంలోని మబగాంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ స్వగృహంలో నలుమూలల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్వగృహంలో టిడిపి నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వెదుళ్లవలసలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు స్వగృహంలో, చీడివలసలో ఎంపిపి ముద్దాడ దమయంతి, భైరాగినాయుడు స్వగృహంలో, సుసరాంలో మాజీ ఎంపిపి తమ్మినేని భూషణరావు స్వగృహంలో నాయకులు, అధికారులు వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కవిటి: ఎమ్మెల్యే అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్‌లకు నాయకులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మెళియాపుట్టి : పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌కు, సిరిపురపు తేజేశ్వరరావు, టిడిపి నాయకులు మామిడి గోవిందరావులకు, మెళియాపుట్టిలో ఎంపిపి రానా ఈశ్వరమ్మ, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, మాజీ ఎంపపి సలాన మోహనరావులకు నాయకులు, అధికారులు, తహశీల్దార్ సరోజని, ఎంపిడిఒలకు అధికారులు పుష్పగుచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వజ్రపుకొత్తూరు: జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పాలిన శ్రావణి, వైసిపి జిల్లాఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావులకు నాయకులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షుడు మద్దిల హరినారాయణ, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు పాలిన ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు దున్న రత్నం బాలరాజు, మామిడి భాస్కరరావు, కొల్లి భాస్కరరావు, బచ్చాల ధర్మారావు, ఎంపిటిసి మాకయ్య కారి వెంకటరావు పాల్గొన్నారు.

టెక్కలి : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు కార్యాలయానికి నాయకులు వచ్చి పుష్పగుచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోత మధుసూదనరావు, పొట్నూరు ఆనందరావు, శాసుమహంతి ధర్మారావు పాల్గొన్నారు.

పలాస టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి గౌతు శివాజీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషకు నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, పి.విఠల్‌రావు, వజ్జ గంగాభవాని, మాజీ ఎంపిపి దువ్వాడ కృష్ణమూర్తినాయుడు, టంకాల రవిశంకర్ గుప్త, బూరెల విజయ్, బి.నాగరాజు, మల్లా శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, సర్పంచ్‌లు, ఎంపిటిసిల ఇళ్ల వద్ద నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు.

టెక్కలి రూరల్ : మండలంలోని అక్కవరంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణిలకు నాయకులు, అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగా కృపారాణి దంపతులకు పూలమాలలు వేసి సన్మానించారు.

కొత్తూరు : మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు టిడిపి నాయకులు పుష్పచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావుకు వైసిపి నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ వైస్ ఎంపిపి అగతముడి భైరాగినాయుడు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

పొందూరు: మండల యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌సిలో సోమవారం న్యూఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు పైడి వెంకటరామరాజు, పి.రాజారావు కేకు కట్ చేసి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా పూర్వ అధ్యక్షులు పొందూరు అప్పారావు, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుగుబెల్లి గోపాలరావు, కెవిఎం సత్యనారాయణ, ట్రెజరర్ గుంటుకు వాసుదేవరావు, పి.కృష్ణారావు, బొడ్డేపల్లి అర్జునరావు, శ్యామలరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : నూతన సంవత్సర శుభాకాంక్షలు తమ నాయకుడు కూన రవికుమార్‌కు చెప్పేందుకు నియోజకవర్గ పరిధిలో బూర్జ, పొందూరు, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాలతో పాటు మున్సిపాలిటీ ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

అలాగే వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రతినిధి సువ్వారి సత్యనారాయణ(ఢిల్లీ)కి పలు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన పార్టీ కార్యాలయానికి చేరుకొని పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైసిపి సీనియర్ నాయకుడు కోట గోవిందరావుకు పలు మండలాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లిలో మాజీమంత్రి గుండ అప్పలసూర్య నారాయణ, మాజీ శాసన సభ్యులు లక్ష్మీదేవిలు ఆనందోత్సవాల నడుమ కేకు కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ వేడుకల్లో టిడిపి నాయకులు అభిమానులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో గార, శ్రీకాకుళం మండలాలతో పాటు నగరానికి చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు.


కవిటి : ఎమ్మెల్యే అశోక్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు


శ్రీకాకుళం : గుండ దంపతులను అభినందిస్తున్న నాయకులు


పలాస : చిన్నారితో ముచ్చటలాడుతున్న గౌతు శిరీష


మెళియాపుట్టి : శ్రీకాంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అభిమానులు


వజ్రపుకొత్తూరు : పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు


టెక్కలి : పరమేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు


కవిటి : ఎంపిపి పద్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు


కొత్తూరు : వెంకటరమణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు


ఆమదాలవలస : గాంధీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ నాయకుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో స్పెషల్ ఫీజు పేరిట కాలేజీ ఫీజులు పెంచి విద్యార్థులకు భారాన్ని మోపితే ఆందోళన ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం ఆందోళన చేపట్టారు. జెవిడి పడకుండానే విద్యార్థులకు కళాశాల ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాళ్లు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. ఫీజులు కట్టకపోతే హాల్ టిక్కెట్లు ఇవ్వమని బెదిరిస్తూ దౌర్జన్యంగా పెంచిన ఫీజులను విద్యా ఒఎస్ యాప్ ద్వారా చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు. జెవిడి పడకుండా మేము ఎలా కట్టేదని విద్యార్థులు మొరపెట్టుకున్నా ప్రిన్సిపాళ్లు కట్టాలని ఒత్తిడికి గురిచేయడం మానుకోవాలన్నారు. విద్యార్థులకు అసౌకర్యంగా ఉన్న విద్యా ఒఎస్ యాప్‌ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ గోవిందమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు యు.దుర్గాప్రసాద్, గర్ల్స్ కన్వీనర్ మానస, టెక్కలి కమిటీ తరుణ్ భూపతిపాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- పలాస

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచి పనులు చేస్తూ ఈ ఏడాదంతా ముందుకు సాగాలని పొత్రియ సీయోను గ్రీస్ చర్చ్ ఫాస్టర్ సవర జగన్నాయకులు అన్నారు. మండలంలోని గట్టుమీదవూరులో సోమవారం క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి మార్గాన్ని ఎంచుకొని సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం గిరిజన బాలికలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ కేక్ ను కట్ చేశారు. సవర జగన్నాయకులు, కృపాకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టెక్కలి ఫీల్డ్ కో-ఆర్డినేటర్ ఎస్.లక్ష్మణరావు, అసిస్టెంట్ ఫాస్టర్ ఎస్.సురేష్, సంఘ కమిటీ సభ్యులు సుబ్రరా, కేశవరావు, గున్నయ్య, మాధవరావు, తేజేశ్వరరావు, ప్రవీణ్, వాసుదేవరావు, సవర సురేష్, సవర కిరణ్, సవర సంజీవ్, సవర శేఖర్ పాల్గొన్నారు.


కేక్‌ను కట్ చేస్తున్న జగన్నాయకులు

శ్రీశైలంలో నాట్య ప్రదర్శన



నాట్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి భరతనాట్యం జానపద నాట్య శిక్షణాలయం కళాకారులు శ్రీశైలం ఆలయంలో నాట్య ప్రదర్శనకు అవకాశం లభించింది. ఈ మేరకు శ్రీశైలం దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యాన ధర్మాపథం నిత్యకళారాధన సాంస్కృతిక కార్యక్రమంలో స్వేచ్ఛా నృత్య తరంగిణి నాట్య కళాకారులకు కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఆదివారం రాత్రి నుంచి నిర్వహించారు. కూచిపూడి నాట్య ప్రదర్శనలో కళాకారులు నాట్య గురువు మంగి దివ్య, కె.కుమార్. పి.వర్షిత, ఎ.కృతజ్ఞ, ఎం.తేజశ్రీ, డి.జోషిత. సిహెచ్.మానస, డి.ఉపాసన, ఎస్.లావణ్య, బి.అనుశ్రీ, ఎస్.లాష్య. జి.స్రవ్య, బి.శ్రీవల్లికలు పాల్గొన్నారు. ఈ నాట్య ప్రదర్శనలో శివా తాండవం. ఆనందతాండవం, శివా శివా శంకరా... శివధర్మం, శివ పదమంజిరనదం, కదిలింది కైలాస శిఖరం, అయిగిరినందిని పాటలు ప్రదర్శించారు. అనంతరం అకాడమీ అధ్యక్షులు కె.గోవిందరావు, కోశాధికారి మంగి దాలమ్మలకు శ్రీశైల దేవస్థానం అధికారులు జి.రావి, వి.గణేష్‌లు ప్రశంసాపత్రాలను అందజేశారు.

పెన్షనర్ల లైఫ్ సర్టిఫికేట్లకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఖజానా శాఖ పరిధిలో ఉన్న ఉప ఖజానా కార్యాలయాల్లో ప్రభుత్వ ఫెన్షనర్లకు లైఫ్ సర్టిఫికేట్లను ఆన్‌లైన్‌లో జత చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని డిడి సిహెచ్ రవి కుమార్ తెలిపారు. సోమవారం ఉపఖజానా కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఆయన ప్రారంభించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికేట్లను జత చేసుకోవాలని ఆయన పెన్షనర్లకు సూచించారు. సాంకేతికపరమైన ఇబ్బందులు ఉన్నట్టయితే జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సహాయ ఖజానాధికారి తవిటన్న, ఉప ఖజానాధికారి ఎం.తులసీరావు పాల్గొన్నారు.


హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న ట్రెజరీ అధికారులు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం


ఆమదాలవలస : మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కాంట్రాక్టు, అవుట సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవదిక సమ్మె సోమవారం కొనసాగింది. నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా శిబిరాన్ని ఎపి మున్సిపల్‌వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన కొనసాగించారు. శిబిరంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాంలు కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రత్నామ్నాయ పద్ధతులు అవలంబిస్తూ సమ్మెను నీరుగార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్మికులందరిని పర్మినెంట్ చేసి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. జీవో నెంబర్ ఏడు ప్రకారం క్లాప్ ఆటోలో డ్రైవర్లకు నెలకు రూ. 18,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ శిబిరంలో యూనియన్ నాయకులు కళ్యాణ రాజు, అర్‌జి రాము, ఎ.రాజేష్, జె.మాధవి, టి.వెంకటలక్ష్మి, ఎ.మోహన్, డి.యుగంధర్, ఎం.నారాయణరావు, అప్పన్న, డి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలో మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె ఏడవ రోజుకు చేరుకోవడంతో మోకాళ్ళపై నిల్చొని విన్నుతనంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక నాయకులు తాడి సంతోష్, తారకేశ్వరరావు, జె.శ్రీను పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం ఒంటి కాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్ల పరిష్కారానికి పట్టించుకోవడం లేదని, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రమేష్‌కుమార్ పట్నాయక్ మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పలాస : ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ఏడో రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు కాశీబుగ్గ గాంధీ విగ్రహం మూడు రోడ్ల జంక్షన్ రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మురగన్, ఎం.రవి, దివాకర్, ఎస్.శంకర్, తిరుపతి, ప్రకాష్ ముఖి, సీతమ్మ, గులాబీ, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు



పలాస : ధర్నా ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

సచివాలయాలతోనే సుపరిపాలన

శాసనసభ స్పీకర్ సీతారాం


మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సచివాలయాలతోనే సుపరిపాలన సాధ్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం మండలంలో చింతలపేటలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. నేడు దేశమంతా ఆంధ్రరాష్ట్రం వైపు చూస్తుందన్నారు. సచివాలయాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు నేడు సచివాలయాల ద్వారా అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, పిఎసిఎస్ ప్రెసిడెంట్ గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎంపిటిసి తమ్మినేని బాలమణి, వైసిపి నాయకులు పేడాడ రమణ, ముకుంధరావు, సైలాడ దాసునాయుడు, గురుగుబెల్లి చలపతిరావు, నీలారావు పాల్గొన్నారు.

కేలండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జనవిజ్ఞాన వేదిక సైన్స్ క్యాలెండర్ పట్టణంలోని యుటిఎఫ్ భవన్‌లో జనవిజ్ఞాన వేదిక నాయకులు ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందని తెలిపారు. జనవరి 7న నగరంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చెకుముకి జిల్లాస్థాయి సైన్స్ సంబరాలు ఉదయం 9గంటలకు జరుగునున్నాయని, జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక కార్యదర్శి, పూర్వ ఉప విద్యాశాఖ అధికారి కొత్తకోట అప్పారావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు పాలకొండ కూర్మారావు, సామ సంజీవరావు పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

కోటబొమ్మాళి: మండల నిమ్మాడలో నాయీబ్రాహ్మణ సంఘం 2024 కేలండర్‌ను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తమ న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీఇచ్చారు. నాయీబ్రాహ్మణ జిల్లా సాధికారిక పార్లమెంటరీ కన్వీనర్ కుప్పిటి వెంకటరావు, ఉపాధ్యక్షులు నౌగాపు నాగరాజు, తెలగవలస అప్పన్న, జమ్ము రవికుమార్, కుప్పిలి ఈశ్వరరావు పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఇఒ గోవిందరావు

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

కొత్తూరు : మండల విద్యా వనరుల కేంద్రం ఎంఇఒ సిహెచ్.గోవిందరావు, మండలంలోని మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం డి.ఎల్.నరసింహం సోమవారం యుటిఎఫ్ డైరీలను ఆవిష్కరించారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.శోభన్‌బాబు, కె.విజయ్ కుమార్, బి.శ్రీను, జి.మాధవరావు, దండు ప్రకాశరావు, ఆర్.ఆర్.కొండలరావు, టి.భద్రయ్య, టి.గణపతి, టి.మదుసూదన్, శివప్రసాద్, రాం బాబు, గణేష్, ప్రసాద్, బాలకృష్ణ, బి.స్వర్ణలత, పి.వాణి, ప్రనభావతి, పుణ్యవతి పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా అడ్డయ్య


నియామకపత్రం అందుకుంటున్న అడ్డయ్య

ఎచ్చెర్ల : డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా వర్శిటీ సీనియర్ అధ్యాపకులు ఆచార్య బి.అడ్డయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు రిజిస్ట్రార్‌గా సేవలందిన ఆచార్య సిహెచ్.ఎ.రాజేంద్రప్రసాద్ రెండేళ్ల పదవీకాలం ఆదివారంతో ముగియడంతో ఆచార్య బి.అడ్డయ్యను ఈ స్థానంలో నియమిస్తూ వర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య నిమ్మ వెంకటరావు ఆదేశాలు జారీ చేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రస్తుతం కొనసాగుతున్న అడ్డయ్య, ఆ పదవితో పాటు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా డా.బిఆర్ఎయుకు వ్యవహరించనున్నారు.

క్రైమ్ కార్నర్


మృతి చెందిన లక్ష్మణరావు

యువకుడు దుర్మరణం


ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ఫరీదుపేట కూడలి వద్ద జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఐచర్ వాహనం జాతీయ రహదారిపై ఆగి ఉంది. అటుగా వెళ్తున్న ఆటో ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు కేశవరావుపేట గ్రామానికి చెందిన పేడాడ లక్ష్మణరావు (23)గా గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులు గోదావరి, అప్పలనాయుడు, అన్నయ్య ఉన్నారు.

టెక్కలిలో...

టెక్కలి రూరల్ : మండలంలోని కె.కొత్తూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పానిల గంగయ్య (34) మృతి చెందాడు. తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్న గంగయ్య టెక్కలి నుంచి ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళ్తున్నాడు. కె.కొత్తూరు సర్వీసు రోడ్డు సమీపంలో బైక్ పంక్చర్ కావడంతో ఒక్కసారిగా అదుపు తప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. గ్రామస్తులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మార్గంమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడికి భార్య సుజాత, కుమారులు చరణ్, అజయ్ ఉన్నారు. ఎస్ఐ-2 రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలల తాకిడికి వ్యక్తి మృతి


అజిత్‌కుమార్ మృతదేహం

సోంపేట : మండలంలోని మామిడిపల్లికి చెందిన మర్రి అజీత్ కుమార్ (50) సముద్రంలోకి సోమవారం స్నానానికి వెళ్లి మృతి చెందాడు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సముద్రంలోకి స్నానానికి వెళ్లారు. ఒక్కసారిగా అలల తాకిడి ఎక్కువ కావడంతో కొట్టుకుపోయాడు. స్థానికులు గమనించి కాపాడేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండాపోయింది. సాయంత్రం గ్రామ సమీపంలో గొల్లగంది తీరంలో మృతదేహం కొట్టుకొచ్చింది. మృతుడికి భార్య శైలజ, కుమారుడు అంకిత్, కుమార్తె వృతి ఉన్నారు. మృతుడు ఎల్ఐసి ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఎస్‌సి బాలుర విద్యార్థుల మధ్య ఆదివారం అర్ధరాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. వసతిగృహంలో ఉంటున్న వంశి, స్టాలిన్, పిరియా తరుణ్, ప్రేమ్‌చంద్‌ల మధ్య చిన్నపాటి వాగ్యుద్ధం ప్రారంభమైంది. దీంతో రెండు గ్రూపులకు చెందిన విద్యార్థులు బయట వ్యక్తులకు సమాచారం ఇవచ్చారు. వారి వసతిగృహానికి చేరుకుని బాహాబాహీకి తలపడ్డారు. పిడిగుద్దులు గుద్దుకుంటూ ఘర్షణ పడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో చేరుకుని చెదరగొట్టారు.



పుక్కళ్లపాలెం తీరంలో జన సందోహం

జన'సంద్రం'

కవిటి: నూతన సంవత్సర వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ ఏకమవడంతో ఆనందోత్సవాలు వెల్లువిరిశాయి. ఆడారు, పాడారు, సరదాగా సంద్రంలో తడిశారు. నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ, ఆనందోత్సవాల వేడుకలకు వేదికైన కవిటి మండలం పుక్కళ్లపాలెం తీరం జన 'సంద్రం'గా మారింది.

వైసిపి మండల కమిటీ నియామకం

ప్రజాశక్తి-బొండపల్లి

వైసిపి మండల నూతన కమిటీని ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. మండల అధ్యక్షులుగా బొద్దల చిన్నంనాయుడు, ఉపాధ్యక్షులుగా తాళ్లపూడి అప్పలనాయుడు, మంత్రి శ్రీరాములనాయుడు, ప్రధాన కార్యదర్శులుగా బాలి మన్మథరావు, సిరిపురపు జామినాయుడు, వేమలి వెంకటరావు, కోశాధికారిగా శిరిపురపు నాయుడుబాబును నియమించారు.



కేక్ కట్ చేస్తున్న పిఒ కల్పనాకుమారి

పిఒకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - సీతంపేట

నూతన సంవత్సర వేడుకలను స్థానిక ఐటిడిఎలోసోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ కల్పనాకుమారి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కేక్ కట్ చేసి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలుపుకొన్నారు. పిఒకు అధికారులు శు భాకాంక్షలు తెలిపారు. ఐటిడిఎను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి మంగవేణి, డిప్యూటీ డిఇఒ లిల్లీ రాణి, సిడిపిఒ రంగలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, హరికృష్ణ పిహెచ్ఒ గణేష్, ఎఎంఒ కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

మధురవాణి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- విజయనగరం కోట

వాజ్ ఛానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు నివాసంలో సోమవారం తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వర్ధమాన రచయిత డోకి చంద్రశేఖర్ రాసిన మధురవాణి పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంచి పుస్తకాలు నేస్తాలవంటివని, ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని మెరుగుపరచేందుకు పుస్తకాలు దోహదపడతాయని ఈ సందర్భంగా శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో తెలుగుభాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్, రచయిత చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా 'వెన్నె' పుట్టిన రోజు వేడుకలు

గుర్ల: టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎంపిపి వెన్నె సన్యాసినాయుడు పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తిరుముల రాజు కిరణ్ కుమార్, సన్యాసినాయుడుకి జన్మదిన శు భాకాంక్షలు తెలిపి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా తెట్టంగిలో విజయ బ్లడ్ బ్యాంకు మెగా రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. వెన్నె సన్యాసినాయుడు మాట్లాడుతూ రక్త దానం ప్రాణదానంతో సమానమన్నారు. తన జన్మదిన సందర్భంగా రక్తదానం చేసిన వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. వీరికి విజయ బ్లడ్ బాంక్ తరుపున బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్లు ను అందచేశారు.

యువత శిక్షణను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

యువత స్వయం ఉపాధి కొరకు పుట్టగొడుగుల శిక్షణను వినియోగించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి కోరారు. సోమవారం పట్టణంలో కృషి విజ్ఞాన కేంద్రంలో రెండో రోజు యువ రైతులకు పుట్టగొడుగుల శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ సునీత పుట్టగొడుగుల్లో వివిధ రకాలు పెంచే విధానంపై యువ రైతులకు వివరించారు. కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష మాట్లాడుతూ పుట్టగొడుగుల శిక్షణను వారం రోజుల పాటు ఇవ్వడం జరుగుతుందని దీనిని వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, యువ రైతులు, కెవికె సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు శిక్షణను ఇస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ సునీత

దళిత సంఘాల నివాళి



ప్రదర్శన నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దళిత ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాటాలను బలోపేతం చేసేందుకు భీమ కొరెగావ్ మృతవీరుల స్ఫూర్తితో ముందుకు సాగాలని కెఎన్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలో అంబేద్కర్ కూడలి వద్ద దళిత సంఘాల ఆధ్వర్యాన భీమకొరెగావ్ మృతవీరులకు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర పూణే జిల్లాలో సిరూర్ తాలూకా భీమానది ఒడ్డున గల భీమా కోరెగావ్ గ్రామంలో 1818 జనవరి 1న బ్రిటీష్ సైన్యానికి మరాఠా సామ్రాజ్యకు చెందిన భజీరావు పీష్వా సైన్యానికి జరిగిన యుద్ధంలో పెద్దసంఖ్యలో దళితులు మృతి చెందారని, వారిని స్మరించుకుంటూ దళిత పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, డిటిఎఫ్ నాయకులు కోత ధర్మారావు, కెఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, కార్యదర్శి ఎస్‌వి జగన్నాధం, రాకోటి రాంబాబు, ఎంఆర్‌పిఎస్ నాయకులు బోసు మన్మథరావు పాల్గొన్నారు.

దామోదరరావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- రణస్థలం

మండలం కేశవరాయపాలేం గ్రామానికి చెందిన లావేరు మండల సాక్షి విలేకరి జి.దామోదరరావు ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకుని సివిల్ రైట్స్ స్టేట్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు సోమవారం దామోదరరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదరరావు ఆత్మహత్య చేసుకోలేదని, ఇది ముమ్మాటికి రాజకీయ హత్యని ఆరోపించారు. దామోదరరావు మృతికి వైసిపి నాయకుల హస్తం ఉందని, సిబిఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



పరామర్శిస్తున్న తిరుపతినాయుడు

ఎక్కడ చూసినా చెత్తే...



పిఎసిఎస్ కార్యాలయం వద్ద పేరుకుపోయిన చెత్త

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయింది. రోడ్లు, నివాస గృహాలు, దుకాణాలు నడుమ చెత్త చెదారం నిల్వ ఉండడంతో పట్టణ ప్రజలు, ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీని అంతటికీ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదు. వారం రోజులుగా పారిశుధ్యం కార్మికులు సమ్మె బాట పట్టడంతో పట్టణమంతా పారిశుధ్యం లోపించింది. ఎప్పటి కప్పుడు చెత్తా చెదారం శుభం చేయకపోతే పట్టణ ప్రజలు రోగాలు బారిన పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించేందుకు యువత స్వచ్ఛందంగా చెత్తా చెదారాలను శుభ్రం చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో చెత్తను నిప్పు పెట్టారు.

లక్ష్యాలను చేరుకోవాలి

విజయనగరం: జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎస్ఐబి అదనపు ఎస్‌పి ఎస్.వెంకటరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎంఎం సోల్మన్, విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి, విజయనగరం ట్రాఫిక్, డిటిసి, ఎఆర్ డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, పి.శ్రీధర్, ఎ.ఎస్.చక్రవర్తి, డి.విశ్వనాథ్, వీరకుమార్, యానివర్సిటీ, పలువురు సిఐలు, ఎస్ఐలు, పలువురు పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఎస్‌పిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, పోలీసుశాఖ నిర్దేశించుకున్న లక్ష్యాలుకు చేరుకొనే విధంగా సమర్ధవంతంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, పోలీసుశాఖ ప్రతిష్టను పెంచే విధంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక పాటిల్

నేటి నుంచి గాలికుంటు టీకాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పశువులకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటువ్యాధి నివారణ ఉచితటీకాల కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ ఎం.కిషోర్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గాలికుంటువ్యాధి వల్ల రైతులకు ఆర్థికంగా చాలా నష్టం జరుగుతుందని, పశువులకు తీవ్రమైన జ్వరం, నోటిలో పుండ్లు ఏర్పడి ఆహారం తీసుకోలేక అస్వస్థతకు గురవుతున్నాయన్నారు. పాలఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు. ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గుతుందని, చూడి పశువులు ఈసుకు పోతాయన్నారు. క్రమం తప్పకుండా గాలికుంటు టీకాలు వేయించాలని కిషోర్ కోరారు.



నినాదాలు చేస్తున్న సమతా సైనిక్ దళ్ నిర్వాహకులు


స్వాభిమాన పోరాటాలకు స్ఫూర్తి

టెక్కలి : సమసమాజ స్థాపనకు పాటుపడిన భీమా కోరేగాం యుద్ధ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సమతా సైనిక్ దళ్ జిల్లా కన్వీనర్ చల్లా రామారావు అన్నారు. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద కోరేగాం జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నిర్వాహకులు బోకర చిన్నారావు, అక్కురాడ మాధవరావు, ఎస్.శివప్రసాద్, పర్రి రామకృష్ణ, డొంక నాగు పాల్గొన్నారు.

రేపు 'చలో మంగళగిరి'

ప్రజాశక్తి- జి.సిగడాం

ఈ నెల 3న గుంటూరు జిల్లా మంగళగిరిలో రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ సర్పంచ్‌ల సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్‌ల సంఘ రాష్ట్ర కార్యదర్శి బోగాది అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు వస్తున్నారన్నారు. జిల్లాలో అన్ని పార్టీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు పాల్గొనాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా 16 డిమాండ్ల సాధనకోసం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ఈ సదస్సులో రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈయనతో పాటు మాజీ ఎంపిపి రవికుమార్, సర్పంచ్‌లు, నాయకులు ఉన్నారు.



చెక్కును అందజేస్తున్న సత్యారావు దంపతులు

రూ.మూడు లక్షల విరాళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో అతిథిగృహం నిర్మాణానికి సోమవారం నగరానికి చెందిన కోరాడ సత్యారావు, మాధవి దంపతులు రూ.3లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మను కలిసి విరాళం చెక్కును అనివేటి మండపంలో అందించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని సత్యారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, అధికారులు పాల్గొన్నారు.